సాక్షి కృష్ణాజిల్లా
గురువారం । 13 । మార్చి । 2025



బీఈడీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కోనేరుసెంటర్(మచిలీపట్నం): బీఈడీ, స్పెషల్ బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను కృష్ణా విశ్వవిద్యాలయం వీసీ కె.రాంజీ బుధవారం విడుదల చేశారు. 1,118 మంది ఉత్తీర్ణులయ్యారు.



తిరుపతమ్మ సేవలో సోము వీర్రాజు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మను బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి సోము వీర్రాజు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహరి (శుక్ర)
విజయవాడ	6.22	4.59
మచిలీపట్నం	6.21	4.57

న్యూస్‌రీల్

66 మంది కేయూ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక



కోనేరుసెంటర్(మచిలీపట్నం): కృష్ణా విశ్వవిద్యాలయంలో చైతన్య విద్యాసంస్థలు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలకు విశేష స్పందన లభించింది. ఈ నెల ఐదు, ఆరు తేదీల్లో నిర్వహించిన మౌఖిక, రాత పరీక్షల్లో విశ్వవిద్యాలయానికి చెందిన 66 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు ఉపకులపతి ఆచార్య కె.రాంజీ, రెక్టర్ ఆచార్య ఎం.వి.బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.ఉష చేతుల మీదుగా బుధవారం నియామక పత్రాలు అందజేశారు. ఉపకులపతి ఆచార్య రాంజీ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ప్రాంగణ ఎంపికలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. విశ్వవిద్యాలయ ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సమన్వయకర్త డాక్టర్ కిషోర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కంప్యూటర్ సైన్స్ డీన్ ఆచార్య వై.కె.సుందర కృష్ణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంక్‌లో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): సూర్యారావుపేటలోని చిగురుపాటి మంజువాణి వరప్రసాద్ లయన్స్ డిస్ట్రిక్ట్ 316 బ్లడ్ బ్యాంకులో ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా ఎయిడ్స్ అండ్ టీబీ నివారణ అధికారి డాక్టర్ జె.ఉషారాణితో కలిసి బ్లడ్ బ్యాంకులో నిల్వ ఉన్న రక్తం యూనిట్లు, రక్తం నిల్వలకు అనుసరించాల్సిన నియమ నిబంధనలను పరిశీలించారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు.

ఎన్టీటీపీఎస్ బూడిదకు టెండర్లు

సాక్షి ఎఫెక్ట్..

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ బూడిద అక్రమ వ్యాపారంపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆ సంస్థ ఉన్నతాధికారులు స్పందించారు. చెరువులో బూడిద నిల్వలను టెండర్ ద్వారా విక్రయించడం ఉత్తమ మార్గమనే నిర్ణయానికి వచ్చారు. గత నెల రెండో తేదీన 'బూడిదలో కాసుల వేట' పేరుతో 'సాక్షి'లో కథనం వెలువడింది. అప్పట్లోనే ఈ అంశంపై విజిలెన్స్ అధికారులు ఎన్టీటీపీఎస్ అధికారుల నుంచి రాతపూర్వక వివరణ తీసుకున్నట్లు సమాచారం. ఆ తర్వాత సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ల స్థాయిలో సమావేశం నిర్వహించి టెండర్ వైపు మొగ్గుచూపారు. ఈ నేపథ్యంలో ఏపీ జెన్‌కో అధికారులు రూ.150 కోట్ల అంచనాలతో మూడేళ్ల కాలానికి టెండర్లు పిలిచారు. వార్షిక ఆదాయం రూ.400 కోట్ల టర్నోవర్ ఉన్న సంస్థలు టెండర్‌లో పాల్గొనే హక్కు కల్పించారు. ఈ నెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో టెండర్‌లు దాఖలు చేసుకునే అవకాశం కల్పించారు. 26వ తేదీన టెండర్లు ఓపెన్‌చేసి కేటాయింపులు చేస్తారు. ఏప్రిల్ ఒకటి నుంచి టెండర్‌దారుడు బూడిద సేకరించే అవకాశం ఇస్తారు. 'సాక్షి' కథనంతో బూడిద అక్రమార్కులకు చెక్ పెట్టడంతో పాటు జెన్‌కో సంస్థకు ఆదాయం సమకూరనుంది.

యువ ఆగ్రహ జ్వాల

కూటమి ప్రభుత్వ మోసాలపై కన్నెర్రజేసిన యువత

ఎన్నికల హామీల అమలులో మాట తప్పిన కూటమి ప్రభుత్వ తీరుపై యువతలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. మచిలీపట్నంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువత పోరులో విద్యార్థులు, నిరుద్యోగులు, యువతీయువకులు పాల్గొని ర్యాలీలు, ధర్నాతో కదం తొక్కారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, విద్యాదీవెన, నిరుద్యోగ భృతి చెల్లించాలని, డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని నినదించారు.

- ఫీజు చెల్లించేంత వరకు పోరాటం ఆపేది లేదు
- బడ్జెట్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు తగినన్ని నిధులేవి?
- మొదటి సంతకానికి విలువ లేకుండా చేశారు
- కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం
- భారీ జనసందోహం మధ్య యువత పోరు



మచిలీపట్నంలో యువత పోరు ర్యాలీ

చిలకలపూడి(మచిలీపట్నం): వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో నిర్వహించిన యువత పోరుకు విద్యార్థులు, యువతీయువకులు, నిరుద్యోగుల నుంచి విశేష స్పందన వచ్చింది. వేలాది మంది స్వచ్ఛందంగా తరలివచ్చి ఆందోళనలో పాల్గొని ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. యువత పోరు కార్యక్రమానికి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) ఇంటి నుంచి ధర్నా చౌక్ వరకు నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చౌక్ వద్ద శాంతియుతంగా ధర్నా చేశారు.



మచిలీపట్నంలో యువత పోరు ర్యాలీలో పాల్గొన్న పేర్ని నాని, పార్టీ నాయకులు



యువత పోరులో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, మేయర్ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, మహిళలు

ఫీజు చెల్లించేంత వరకు పోరాటం



మచిలీపట్నంలో యువత పోరు ర్యాలీ



వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసే వరకు పోరాటాన్ని విరమించేది లేదని స్పష్టంచేశారు. కూటమి అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా సామాజిక పింఛన్లు తప్ప ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని దుయ్యబట్టారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్ర బాబు, పవన్ కల్యాణ్, మోదీ పేద, బడుగు, బలహీనవర్గాలకు ఎటువంటి లబ్ధి చేకూర్చలేదన్నారు. కూటమి అధికారం లోకి వచ్చాక విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించకపోవటంతో కళాశాలల్లో యాజమాన్యం వేధింపులకు గురిచేస్తోందని, తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఒత్తిళ్లతో అప్పులు చేసి ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని వివరించారు. ఇటీవల విడుదల చేసిన బడ్జెట్‌లో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం అరకొర నిధులు కేటాయించడాన్ని చూస్తే ప్రభుత్వ చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతోందన్నారు. రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పి కేవలం గుంతలు పూడ్చి ప్రజల కళ్లకు గంతలు కడుతున్నారని ఎద్దేవాచేశారు. ప్రజల అవసరాలను తీర్చకుండా వారిపై పన్నుల భారం మోపుతు న్నారని ఎండగట్టారు. ప్రజలకు ఎటువంటి లబ్ధి చేకూర్చ కుండా సర్వేల పేరుతో ప్రభుత్వ పాలన ఎలా ఉందని ఫోన్లు చేసి అడగటం విడ్డూరంగా ఉందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేకపోవటం ఇంకా ధాన్యం కుప్పలు ఉన్నా కొనుగోలు కేంద్రాలు మూసివేయటంతో మిల్లర్లు దోచుకుంటున్నారని వివరించారు. నిరుద్యోగులకు భృతి ఇస్తానని చెప్పి మూడు పైసలు కూడా ఇవ్వలేదన్నారు. ప్రమాణస్వీకార సమయంలో డీఎస్సీపై చంద్రబాబు చేసిన మొదటి సంతకానికి కూడా విలువ లేకుండాపోయిందన్నారు. అనంతరం కలెక్టర్ డి.కె.బాలాజీకి వైఎస్సార్ సీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షుడు భరత్, మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, పార్టీ నాయకులు షేక్ సలార్‌దాదా, షేక్ అచ్చెబా, చిటికిన నాగేశ్వరరావు, లంకా సూరిబాబు, లంకే వెంకటేశ్వరరావు, మేకల సుబ్బన్న, పల్లి శేఖర్, జోగి చిరంజీవి, ఆయా నియోజకవర్గాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కలెక్టర్ బాలాజీకి వినతిపత్రం ఇస్తున్న పేర్ని నాని, కైలే అనిల్‌కుమార్, సింహాద్రి రమేష్‌బాబు, ఉప్పాల హారిక, ఉప్పాల రాము తదితరులు



ర్యాలీగా వస్తున్న పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి కైలే అనిల్‌కుమార్

కక్ష సాధింపులకే ప్రాధాన్యం



వైఎస్సార్ సీపీ వారికి ఎటువంటి పనులూ చేయవద్దని సీఎం చంద్రబాబు బహిరంగంగా చెబుతున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో కులాలు, మతాలు, పార్టీలు చూడకుండా అందరి సంక్షేమం కోసం పనిచేశాం. బడ్జెట్‌లో ప్రజల అవసరాలకు సరైన కేటాయింపులు లేకుండా హామీల అమలుకు చిత్తశుద్ధి లేకుండా నేడు కూటమి పాలన సాగుతోంది. కేవలం కక్షసాధింపు చర్యలకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

– ఉప్పాల హారిక, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్

మంచి చేద్దామనే ఆలోచన లేదు



పది నెలల కూటమి పాలనలో మోసాలను కప్పిపుచ్చుకుంటున్న తీరును చూస్తున్నాం. ప్రతి మాటలో గత ప్రభుత్వం అంటున్నారు తప్ప ప్రజలకు మంచి చేద్దామనే ఆలోచన పాలకులకు లేదు. విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చి ఐటీ ఉద్యోగులుగా మార్చింది వైఎస్ రాజశేఖరరెడ్డి. వైఎస్సార్ సీపీ బలమైన కుటుంబం అన్న విషయాన్ని టీడీపీ గుర్తుపెట్టుకోవాలి. అడ్డంకులు ఎన్ని చూపినా పార్టీ ప్రభంజనాన్ని ఆపలేరు.

– కైలే అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే

మోసాలను ప్రజలకు తెలపాలి



మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏ ఒక్క హామీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోంది. చంద్రబాబునాయుడు చేసే మోసాలను ప్రజలకు తెలపాల్సిన అవసరం ఉంది. టీడీపీలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన దగ్గుబాటి వెంకటేశ్వరరావు కనుమరుగవడానికి కారణం చంద్రబాబే. పవన్ కల్యాణ్‌కు త్వరలోనే చంద్రబాబు బులెట్ దింపుతారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

– సింహాద్రి రమేష్, మాజీ ఎమ్మెల్యే

కూటమి ప్రభుత్వ కళ్లు తెరిపిద్దాం



కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై పోరాటాలు చేసి పాలకుల కళ్లు తెరిపించాలి. జగన్ 2.0లో కార్యకర్తలకు పెద్ద పీట వేస్తానన్నారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి పేద కుటుంబాల స్థితిగతులను మార్చాలని ఫీజు రీయింబర్స్‌మెంట్ తీసుకువచ్చారు. దానిని వైఎస్ జగన్ కొనసాగించగా కూటమి ప్రభుత్వం నీరుగారుస్తోంది. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు కానందున ఆందోళన చెందుతున్నారు.

– ఉప్పాల రాము, పెడన నియోజకవర్గ ఇన్‌చార్జ్

మోసపు హామీలతో అధికారం



కూటమి ప్రభుత్వం మోసపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. తొమ్మిది నెలల పాలనకే బాబు పోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఎన్నికల హామీల్లో విద్యార్థులు అందరికీ రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ హామీని విస్మరించారు. మహిళలు మొట్టికాయ వేస్తే తట్టుకునే శక్తి కూటమికి లేదు. మా కార్యకర్తలపై కేసులు పెట్టి భయపెడదామని ప్రయత్నిస్తున్నారు. రానున్న కాలంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి కేసులు పెట్టిన వారితోనే షేక్ హ్యాండ్ ఇప్పిస్తాం.

– పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్

ఎన్ని పోరాటాలకైనా సిద్ధం



పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వంపై ఎన్ని పోరాటాలు చేయడానికైనా సిద్ధంగా ఉన్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని మాయమాటలు చెప్పి వలంటీర్లను పక్కనపెట్టారు. ఇచ్చిన మాట తూచ తప్పకుండా చేయాలంటే అది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమవుతుంది. విద్య, వైద్యంపై ఇచ్చిన మాట నిలబెట్టుకున్న నాయకుడు వైఎస్ జగనే.

– దేవభక్తుని చక్రవర్తి, పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్

ప్రజల సంక్షేమమే వైఎస్సార్ సీపీ అజెండా

- ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం
- వైఎస్సార్ విగ్రహాల వద్ద నివాళులర్పించిన నాయకులు

చిలకలపూడి(మచిలీపట్నం): వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం కృష్ణా జిల్లాలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నంతోపాటు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జులు, సీనియర్ పార్టీ నాయకులు పార్టీ జెండాలను ఎగురవేశారు. అనంతరం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయ కులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే వైఎస్సార్ సీపీ అజెండా అని పార్టీ నాయకులు స్పష్టంచేశారు.

ప్రజల కోసం పనిచేద్దాం

మచిలీపట్నం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి పార్టీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) ప్రసంగించారు. పార్టీ పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పనిచేస్తోందన్నారు. రానున్న రోజుల్లో కంకణబద్ధులై అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. వైఎస్సార్ ఆశయాలకు అనుగుణంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, రానున్న రోజుల్లో కూడా పార్టీని మరింత ఉత్సాహంగా ముందుకు తీసుకెళ్లేందుకు అందరం ఆయనకు అండగా ఉండాలని సూచించారు. తొమ్మిది నెలల పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవటంతో విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వానికి పోలీసులు తొత్తులుగా మారి ధర్నా చేసే హక్కు కూడా లేదన్న విధంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల తరఫున నిలబడి పోరాటాలు చేస్తూనే ఉంటామన్నారు.



అవనిగడ్డలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సింహాద్రి రమేష్‌బాబు

- మచిలీపట్నం నియోజకవర్గం పరిధిలో పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పార్టీ జెండాను ఎగురవేశారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ సలార్ దాదా పాల్గొన్నారు.



మచిలీపట్నంలో కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని



పామర్రులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్

- పామర్రు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరించిన అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు.
- అవనిగడ్డ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింహాద్రి రమేష్‌బాబు జెండా ఎగురవేశారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా వంతెన సెంటరుకు వెళ్లి అక్కడున్న వైఎస్ విగ్రహానికి పూలమాల వేశారు.
- పెడన నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉప్పాల రాము, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పార్టీ జెండాను ఎగురవేశారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం కేక్ కట్ చేశారు.
- గుడివాడ పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, పార్టీ అధికార ప్రతినిధి ఎం.వి.నారాయణరెడ్డి, సీనియర్ నాయకుడు పాలేటి చంటి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మండలంలోని లింగవరంలో మండల పార్టీ అధ్యక్షుడు జాన్ విక్టర్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రామకృష్ణ, ఎంపీటీసీ గద్దె పుష్పరాణి పాల్గొన్నారు.
- గన్నవరం నియోజకవర్గంలోని గన్నవరం ఎస్సీ కాలనీలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజిబెత్‌రాణి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

- ఇసుక అక్రమ రవాణాపై మైనింగ్ అధికారుల దాడి
- 24 ట్రాక్టర్లు, 18 క్రేన్‌లు, 10 పడవలు సీజ్

ఇబ్రహీంపట్నం: ఫెర్రీ వద్ద కృష్ణానది గర్భంలో యథేచ్ఛగా ఇసుక తవ్వి తరలిస్తున్న ఇసుకాసురులపై మైనింగ్ అధికారులు బుధవారం మెరుపుదాడి చేశారు. మైనింగ్ ఏడీ వీరాస్వామి నేతృత్వంలో జరిగిన దాడిలో అనుమతులు లేకుండా కృష్ణానదిలో డ్రెడ్జింగ్ యంత్రాలతో ఇసుక తవ్వి అక్రమంగా రవాణా చేస్తున్న పది పడవలు, 24 ట్రాక్టర్లు, 18 మ్యాన్యువల్ క్రేన్‌లను సీజ్‌చేశారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను పోలీస్ బందో బస్తు నడుమ స్థానిక ఆర్టీసీ డిపో వద్దకు తరలించారు. ట్రాక్టర్లు, పడవలు, క్రేన్‌ల డ్రైవర్లపై కేసులు నమోదుపై పోలీస్‌లకు రిపోర్ట్ చేశారు.

కూటమి నేతల మాటల యుద్ధం

అక్రమ రవాణా అడ్డుకున్న మైనింగ్ అధికారులపై కూటమి నేతలు మాటల యుద్ధానికి దిగారు. బీసీ నాయకుడిగా చలామణీ అవుతున్న ఒకరు ట్రాక్టర్ డ్రైవర్లు, పడవల యజమానుల తరఫున మైనింగ్ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించాడు. 'ప్రభుత్వం మాది. మా అధినేత ఉచితంగా ఇసుక తీసుకెళ్లమన్నారు. అపడానికి మీరెవరు?' అంటూ రెచ్చిపోయారు. మైనింగ్ ఏడీ వీరాస్వామి వెనక్కు తగ్గక పట్టుబడిన ట్రాక్టర్లు, పడవలు, క్రేన్‌లను సీజ్ చేశారు.



ఇసుక రవాణా చేస్తున్న వారి వివరాలు సేకరిస్తున్న మైనింగ్ ఏడీ వీరాస్వామి



ఇసుక రేవులో సీజ్ చేసిన మ్యాన్యువల్ క్రేన్‌లు

అనుమతులు లేవు

మైనింగ్ ఏడీ వీరాస్వామి మాట్లాడుతూ.. పడవలు, ట్రాక్టర్లు, క్రేన్‌ల యజమానుల వద్ద ఇసుక తవ్వకాలు, రవాణాకు అనుమతులు లేవన్నారు. ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను సీజ్‌చేశామని పేర్కొన్నారు. యజమానులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టంచేశారు. ఆర్ఐ శ్రీనివాస్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఆర్థిక సాయం పెంపు

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



చిలకలపూడి (మచిలీపట్నం): గృహ నిర్మాణ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం పెంపు చేస్తూ జీవోను విడుదల చేసినట్లు కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో బుధవారం సాయంత్రం విలేకర్ల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు ప్రస్తుతం ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.1.80 లక్షలు ఇస్తున్నారని దీనిని రిజర్వేషన్ల వారీగా ఆర్థిక సాయం పెంపు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పర్వత ప్రాంత షెడ్యూల్ తెగలు(పీవీటీజీ)లకు లక్ష రూపాయలు ఆర్థిక సాయం పెంపుదల చేసిందన్నారు.

సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలో బీసీ లబ్ధిదారులు 8,648 ఉండగా వీరికి అదనంగా రూ.43.02 కోట్లు చెల్లించేందుకు నిర్ణయించామని చెప్పారు. అలాగే ఎస్సీ సామాజిక వర్గాల వారు 4,836 మంది ఉండగా వారికి రూ.24.34 కోట్లు, ఎస్టీలు 784 మందికి రూ.5.88 కోట్లు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటి నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, హౌసింగ్ పీడీ ఎస్ వెంకట్రావు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి



ఉంగుటూరు: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధరరావు అన్నారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆత్కూరు జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ.. డీజీపీ ఆదేశాల మేరకు నెలకు రెండు సార్లు పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గ్రామంలో ప్రజలతో సమావేశమై సమస్యలు తెలుసుకుని, సూచనలు, సలహాలు ఇచ్చారు. సైబర్ నేరాలు, అసాంఘిక కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. నేరాలు జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోలీసులతో గస్తీకి సహకరిస్తామని యువత ముందుకురావడం సంతోషంగా ఉందన్నారు. వేసవిలో దొంగతనాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, సెలవుల్లో బంధువుల ఇంటికీ వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలకు శాంతిభద్రతల పరిరక్షణకు తాను, పోలీస్ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటామన్నారు. అత్యవసరమైతే తన ఫోన్ నంబర్ 94407 96400లో సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో హనమాన్‌జంక్షన్ సీఐ కేవీవీఎస్ సత్యనారాయణ, ఎస్‌ఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సారా నిర్మూలనే పల్లెలకు రక్ష

- సారా రక్కసికి బలైపోతున్న కుటుంబ వ్యవస్థ
- సారాను శాశ్వతంగా నిర్మూలించాలంటున్న ప్రజలు
- నిరంతర నిఘా, ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలే నిర్మూలనకు సోపానాలు



తిరువూరు నియోజకవర్గంలో సారా ఊటను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: సాక్షి ప్రతినిధి, విజయవాడ: పల్లెల్లో విజృంభిస్తున్న నాటుసారాకి కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమవుతోంది. సారా తయారు చేస్తున్న కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమవుతున్నప్పటికీ సారా తాగి ఎన్నో పేద కుటుంబాలు కుటుంబ సభ్యులను కోల్పోయి, ఆర్థికంగా నష్టపోయి విచ్ఛిన్నమవుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా, తిరువూరు నియోజకవర్గ పరిధిలో దశాబ్దాలుగా జరుగుతున్న ఈ అక్రమ దందాకు శాశ్వతంగా అడ్డుకట్ట వేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేసినప్పటికీ గత తొమ్మిది నెలలుగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నాటుసారా తయారీ, విక్రయాలు జోరందుకున్నాయి. సారా శాశ్వత నిర్మూలనతోనే పల్లెల్లో వెలుగులు నిండుతాయని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

గిరిజన తండాలే ఆవాసాలు

తిరువూరు నియోజకవర్గంలోని విసన్నపేట, గంపలగూడెం, ఏ కొండూరు మండలాల పరిధిలోని గిరిజన తండాల్లోనే ఈ నాటుసారా తయారీ యథేచ్ఛగా సాగుతోంది. కూలీ పనులకు వెళ్లేవారు నాటుసారా తయారీని కుటీర పరిశ్రమగా మార్చుకున్నారు. ఈ తండాల్లో అటవీ ప్రాంతాలు, మామిడి తోటలతో పాటు ఇళ్ల ప్రాంగణాల్లోనే పెద్ద పెద్ద ప్లాస్టిక్ డ్రమ్ములను భూమిలో పాతిపెట్టి బెల్లం ఊటను నిల్వ చేస్తున్నారు. ఇళ్లలోనే సారా తయారీ చేసే స్థాయికి వెళ్లారంటే ప్రభుత్వ నిఘా ఏస్థాయిలో ఉందో ఇట్టే అర్థమవుతోంది. ఇప్పటికే ఏ కొండూరు మండల పరిధిలో కిడ్నీ వ్యాధి స్థానికులను వణికిస్తున్న క్రమంలో నాటుసారా తయారీ, విక్రయాలు భయాందోళనలను రేకెత్తిస్తున్నాయి.

గ్రామ కమిటీలు, ప్రత్యేక అధికారుల ఏర్పాటు..

సారా ప్రభావిత గ్రామాల్లో ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేశామని ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఒక్కొక్క గ్రామానికి అడక్షన్ ఆఫీసర్లుగా, హెడ్ కానిస్టేబుల్, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులను నియమించాం. సారా తయారీదారులపై పూర్తిగా దృష్టి పెట్టాం. గ్రామ స్థాయిలో అడక్షన్ కమిటీలో గ్రామ పెద్దలు, అడక్షన్ అధికారి, వీఆర్వో, వీఆర్‌ఏ, గ్రామ మహిళ కార్యదర్శులు, యూత్ ఆర్గనైజేషన్ సభ్యులను కమిటీలో సభ్యులుగా ఉంటారు. మండల స్థాయిలో తహసీల్దార్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, ప్రజా ప్రతినిధులు, ఉంటారు. వీరు నెలకు ఒకసారి సమావేశమై, అంతకు ముందు జరిగిన నేరాలు, రాబోయే రోజుల్లో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించి, తదనుగుణంగా నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తారు.

పూర్తిగా రూపుమాపుతాం..

రెండు, మూడు నెలలో ప్రణాళికబద్ధంగా సారాను పూర్తిగా రూపుమాపుతాం. ప్రధానంగా గ్రామ స్థాయిలో గ్రామసభలు నిర్వహించి, సారా తాగడం వలన కలిగే అనర్థాలను కళ్లకు కట్టినట్లు వివరిస్తూ, వారిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. కళాజాత బృందాల ద్వారా అవగాహన కలిగించే విధంగా కార్యక్రమాలు రూపొందిస్తున్నాం. తిరువూరు నియోజకవర్గంలో 103 కేసులు నమోదుచేసి, 15 మందిని అరెస్టు చేశాం. 26 వేల లీటర్ల ఊటను ధ్వంసం చేశాం. గ్రామాల్లో సైతం విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. దాడులను మరింత ఉధృతం చేస్తాం.

సారా నిర్మూలనకు సూచనలు

- స్థానిక ఎక్సైజ్‌శాఖ అధికారులు అవినీతికి పాల్పడకుండా నిస్వార్థంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలి.
- సారా తయారు చేసే వారిపై కఠినమైన శిక్షలు అమలు చేయాలి.
- సారా తయారీ, విక్రయాలు, తాగడం వల్ల కలిగే నష్టాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలి.
- సారా తయారు చేస్తున్న పల్లెల్లో గ్రామానికి చెందిన చదువుకునే యువకులనే వలంటీర్లుగా నియమించుకొని అధికారులు నిరంతర నిఘా ఏర్పాటు చేయాలి.
- సారా తయారీదారులకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధుల సహకారంతో రాయితీలపై రుణాలు ఇప్పించి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపాలి.
- సారా తయారీ, విక్రయాల వల్ల కేసులు నమోదై సమాజంలో ఆ కుటుంబానికి చెందిన పిల్లలు ఎదుర్కొనే ఇబ్బందులను వివరించాలి.
- నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ప్రభుత్వం చేపట్టిన నవోదయం కార్యక్రమాన్ని సమగ్రంగా అమలు చేయాలి.

సారా తయారీకి అడ్డుకట్ట !

– ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు



నాటు సారా తయారీకి అడ్డుకట్ట వేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఎక్సైజ్ డీసీ టి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం సాక్షితో ప్రచురితమైన 'సారా ఏరులు ! ' అనే వార్తపై ఆయన స్పందించారు. సారాను పూర్తిగా రూపుమాపేందుకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను వివరించారు. నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా ఉమ్మడి కృష్ణా జిల్లాలో 40 సారా ప్రభావిత గ్రామాలను గుర్తించామన్నారు. ఈ గ్రామాలను ఏ, బీ, సీ మూడు కేటగిరిలుగా విభజించి స్పెషల్ డ్రైవ్ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో సారా కాపు కాసి, తాగడంతో పాటు, ఇతర గ్రామాలకు సారా సరఫరా చేసే గ్రామాన్ని ఏ కేటగిరిగా, గ్రామంలోనే సారా కాసి, తాగే గ్రామాన్ని బీ కేటగిరిగా, బయట గ్రామాల నుంచి సారా తెచ్చుకొనే తాగే గ్రామాన్ని సీ కేటగిరిగా విభజించామన్నారు.

అవగాహన కల్పించాలి



సారా తాగడం వలన కలిగే అనర్థాలు వివరిస్తూ ఎక్సైజ్ అధికారులు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఏ కొండూరు మండలంలో సారాకు బానిసలై కిడ్నీ వ్యాధిబారిన పడిన వారి గురించి వివరించి సారా మానాలని తెలియజేస్తే ఫలితం ఉంటుంది. – డి.ఆనందరావు, సామాజిక కార్యకర్త, తిరువూరు

సారా అనర్థాలు ప్రచారం చేయాలి



సారాలో కలిపే ప్రమాదకరమైన రసాయనాలతో ఆరోగ్యానికి చేకూరే నష్టాలను తెలుపుతూ ఎక్సైజ్ శాఖ విస్తృత ప్రచారం చేయాలి. మద్యం ధరలు అందుబాటులో లేక సారాకు అలవాటు పడిన వారిలో మార్పుకు ఈ ప్రచారం దోహదపడుతుంది. – ఎం.ఉదయ్, స్థానికుడు, తిరువూరు

దేనికైనా తెగిస్తారు..



సారా లాంటి మత్తు పానీయాలకు అలవాటు పడిన వారు దేనికైనా తెగిస్తారు. దోపిడీలు, దొంగతనాలు, హత్యలు, రేప్‌లు వంటి నేరాలకు నిర్భయంగా పాల్పడతారు. ప్రస్తుతం జరుగుతున్న నేరాల్లో 95 శాతం మత్తులో చేసినవేనని లెక్కలు చెబుతున్నాయి. – డాక్టర్ గర్రే శంకరరావు, సైకాలజిస్ట్

అవయవాలపై తీవ్ర ప్రభావం



సారాయి వంటి మత్తు పానీయాలు సేవించడం వలన శరీరంలోని అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా లివర్, నరాలు, బ్రెయిన్‌పై అధిక ప్రభావం ఉంటుంది. అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. లివర్ క్యాన్సర్‌తో పాటు, ఇతర క్యాన్సర్‌లు సోకవచ్చు. – డాక్టర్ మనోజ్‌కుమార్, జనరల్ మెడిసిన్ నిపుణులు

ఆక్రమణ భూములకు వెసులుబాటు



మాట్లాడుతున్న జేసీ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో అభ్యంతరం లేని భూముల్లో ఆక్రమణలో ఉన్న వారు భూములను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ తెలిపారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో 2019 అక్టోబర్ 15వ తేదీ ముందు నుంచి ఆక్రమణలో ఉన్న వారు ఆ భూములను క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పించారన్నారు. అయితే ఆక్రమణలో ఉన్న వారు నెలకు రూ.10 వేల లోపు ఆదాయం కలిగి ఉండాలని, గతంలో ఎప్పుడూ ఇంటి పట్టా పొంది ఉండకూడదన్నారు. 150 గజాల్లోపు ఉంటే ఎటువంటి ఫీజు లేకుండా దరఖాస్తు చేసుకున్న వెంటనే క్రమబద్ధీకరిస్తారన్నారు. అలాగే 151 నుంచి 300 గజాల్లోపు ఆక్రమణల్లో ఉంటే రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లింపుతో క్రమబద్ధీకరిస్తారని తెలిపారు. 151 నుంచి 300 ఆపైన గజాలు ఉంటే సాధారణ రిజిస్ట్రేషన్ రుసముతోనే క్రమబద్ధీకరించటం జరుగుతుందన్నారు. సచివాలయాల్లో వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని వెంటనే వీఆర్వో, విలేజ్ సర్వేయర్ విచారణ చేసి ఆ దరఖాస్తును తమకు సిఫార్సు చేస్తారన్నారు. దీని ద్వారా ఆ భూమిని తాము క్రమబద్ధీకరిస్తామని ఆమె తెలిపారు.

డప్పు కళాకారుల సమస్యలపై 18న ధర్నా

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): డప్పు కళాకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 18న విజయవాడ గాంధీనగర్‌లోని ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.క్రాంతికుమార్ చెప్పారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్ సమీపంలో ఉన్న పూలే, అంబేడ్కర్ భవన్‌లో డప్పు కళాకారుల సంఘం సభ్యుల సమావేశం బుధవారం జరిగింది. క్రాంతికుమార్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా డప్పు కళాకారుల సంక్షేమంపై దృష్టి పెట్టలేదన్నారు. సర్వేల పేరుతో డప్పు కళాకారుల పెన్షన్లు తొలగించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. డప్పు కళాకారులందరికీ డప్పు, గజ్జెలు, డ్రస్సులు ప్రభుత్వం ఇవ్వాలన్నారు. నాయకులు బి.కరుణాకర్, హనుమయ్య, నాగరాజు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగులు మెరుగైన పనితీరు కనబర్చాలి

కలెక్టర్ డీకే బాలాజీ



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ చిత్రంలో జేసీ గీతాంజలిశర్మ, అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): రెవెన్యూ అంశాలపై పట్టు పెంచుకుని మరింత మెరుగైన పనితీరు కనబర్చాలని కలెక్టర్ డీకె బాలాజీ రెవెన్యూ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సోమవారం జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మతో కలిసి రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజల నుంచి వచ్చే అర్జీలను నాణ్యత, ప్రమాణాలు విధిగా పాటించి సకాలంలో పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 8,091 అర్జీలు రాగా 1,248 అర్జీలు ఇంకా అపరిష్కృతంగా ఉన్నాయని చెప్పారు. నిర్ణీత గడువు దాటి చివరి నిమిషం వరకు ఆగకుండా అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

పెండింగ్ అర్జీలు క్లియర్ చేయాలి..

జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులకు సంబంధించి 4,877 అర్జీలు అందాయని, అందులో 395 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ నెల 24, 25 తేదీల్లో జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ జరగనున్న దృష్ట్యా ఈలోపు వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. సర్వే సెటిల్‌మెంట్‌కు సంబంధించి 147 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఆర్డీవోలు బి.బాలసుబ్రహ్మణ్యం, హేళషారోన్, సర్వేశాఖ ఏడీ జోషిలా, కలెక్టరేట్ ఏవో ఆంజనేయప్రసాద్, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. మహిళ దుర్మరణం



బాణావతు కుమారి మృతదేహం

మైలవరం: ట్రాక్టర్ బోల్తా కొట్టి మహిళ దుర్మరణం చెందిన సంఘటన అన్నేరావుపేటలో బుధవారం జరిగింది. రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట తండాకు చెందిన ఆరుగురు మామిడి కోతలకు వెళ్లి తిరిగి వస్తుండగా రాయుడుపాలెం చెరువు వద్ద గేదెలను తప్పించబోయి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన బాణావతు కుమారి(30) మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన గోపాల్ అనే వ్యక్తిని చికిత్సకు, కుమారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కానిస్టేబుల్ కోటేశ్వరరావు తెలిపారు.

హోంగార్డుల ఐక్యత అభినందనీయం



హోంగార్డు చంద్రశేఖర్‌కు చెక్కు అందజేస్తున్న ఎస్పీ గంగాధరరావు, పోలీస్ అధికారులు

కోనేరుసెంటర్: జిల్లాలో హోంగార్డుల ఐక్యత అభినందనీయమని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు అన్నారు. హోంగార్డు విభాగంలో పనిచేస్తూ ఇటీవల పదవీ విరమణ పొందిన కె.చంద్రశేఖర్‌రావుకు రూ.3,85,530, జనవరి 23వ తేదీన రోడ్డు ప్రమాదంలో మరణించిన జి.యశ్వంత్ కుటుంబానికి రూ.4,23,880 చెక్కులను బుధవారం ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులు పోలీసు శాఖలో సగభాగమన్నారు. లా అండ్ ఆర్డర్‌ను కంట్రోల్ చేయటంతో పాటు బందోబస్తు విధుల్లోనూ హోంగార్డులు తమ వంతు పాత్ర పోషిస్తూ పోలీసు శాఖకు వెన్నుదన్నుగా ఉంటున్నారన్నారు. హోంగార్డులకు ఎటువంటి సమస్య తలెత్తినా ధైర్యంగా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అలాగే పదవీ విరమణ పొందిన హోంగార్డులు, మృతుల కుటుంబ సభ్యులు పోలీసు శాఖ తరఫున ఎప్పుడు ఎటువంటి పని కావాలన్నా నిర్భయంగా అధికారులను సంప్రదించి చేయించుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ, ఆర్‌ఐ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతో ఇక్కట్లు



వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద వేచి ఉన్న రైతులు

గన్నవరం: స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయం బుధవారం ఉదయం 11 గంటల వరకు తెరుచుకోలేదు. దీంతో గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం వచ్చిన రైతులు కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. సాధారణంగా ఉదయం 10 గంటల నుంచి ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి. అయితే బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిమిత్తం వ్యవసాయ శాఖ అధికారి వై.రజని కొండపావులూరు గ్రామానికి వెళ్లారు. కార్యాలయంలోని ఇద్దరు సిబ్బంది కూడా పీ 5 సర్వే నిమిత్తం ఫీల్డ్‌లోకి వెళ్లారు. ఎవరూ రాకపోవడంతో కనీసం ఆఫీస్ తాళాలు కూడా తీయలేదు. దీంతో పీఎం కిసాన్ ఆన్‌లైన్ నిమిత్తం తెంపల్లి నుంచి వచ్చిన లక్ష్మయ్య, రంగయ్య మరికొంత మంది రైతులు కార్యాలయం వద్దే వేచి ఉన్నారు. సదరు రైతులు వ్యవసాయ అధికారిని ఫోన్‌లో సంప్రదించడంతో చివరికి 11 గంటలు దాటినా తర్వాత సిబ్బంది వచ్చి కార్యాలయం తాళాలు తీశారు.

విజయవాడ డివిజన్‌లో రైల్వే జీఎం విస్తృత తనిఖీలు



డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్‌తో కలిసి గోదావరి రైల్వే బ్రిడ్జిని పరిశీలిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ బుధవారం విజయవాడ డివిజన్‌లోని కాకినాడ – సామర్లకోట – రాజమండ్రి – నిడదవోలు – ఏలూరు సెక్షన్‌లలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. విజయవాడ రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్, ఇతర అధికారులతో కలిసి ముందుగా జీఎం కాకినాడ పోర్ట్ రన్నింగ్ రూమ్‌లో తనిఖీని ప్రారంభించారు. అక్కడ లోకో సిబ్బందికి అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించి వారితో మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆయన రన్నింగ్ రూమ్ వద్ద మొక్కలు నాటారు. అక్కడ నుంచి సామర్లకోట రైల్వే స్టేషన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రయాణికులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. స్టేషన్ మాస్టర్ కార్యాలయం, సర్క్యులేటింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం రాజమండ్రి రైల్వే స్టేషన్ చేరుకుని అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదావరి రైల్వే వంతెనను క్షుణ్ణంగా పరిశీలించి, రైలు పట్టాల భద్రతా అంశాలను సమీక్షించారు. అక్కడ నుంచి నిడదవోలు స్టేషన్ చేరుకుని అక్కడ అమృత్ భారత్ పథకంలో భాగంగా స్టేషన్‌లో చేపట్టిన పునరాభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు జీఎంను కలుసుకుని తమ ప్రాంతాలకు సంబంధించిన పలు రైల్వే ప్రాజెక్టులపై వినతిపత్రాలు అందజేశారు. చివరిగా ఏలూరు స్టేషన్‌ను సందర్శించి అక్కడ ప్రయాణికుల సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో బయోమెట్రిక్ గందరగోళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో పని చేయని బయోమెట్రిక్ మిషన్ల కారణంగా తమ వేతనాలు కోతకు గురవుతున్నాయని ఆలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్గగుడిలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది అందరికీ ఫిబ్రవరి నెల నుంచి బయోమెట్రిక్ హాజరును ప్రామాణికంగా తీసుకుంటామని ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బయోమెట్రిక్ నమోదు అయిన రోజుల వరకే వేతనాలు జమవుతాయని దేవస్థాన అధికారులు ముందుగానే హెచ్చరించారు. అయితే బయోమెట్రిక్‌పై కొంత మంది సిబ్బందికి సరైన అవగాహన లేకపోవడం, కొన్ని సమయాల్లో బయోమెట్రిక్ మిషన్లు సరిగా పని చేయకపోవడంతో అధిక మొత్తం సిబ్బంది హాజరులో కోత పడింది. ఫిబ్రవరి నెల పూర్తి స్థాయిలో విధులు నిర్వహించినప్పటికీ అనేక మందికి నెలలో నాలుగు నుంచి ఆరు రోజుల తక్కువగా వేతనం బ్యాంక్ ఖాతాలో జమ కావడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

పని చేయని మిషన్లు..

దేవస్థానంలో విధులు నిర్వహించే సిబ్బంది కోసం మొత్తం ఆరు ప్రాంతాల్లో బయోమెట్రిక్ మిషన్లు ఏర్పాటు చేశారు. మహా మండపం దిగువన టోల్‌ఫ్రీ కౌంటర్, నాల్గో అంతస్తులోని ఈవో చాంబర్, ఏడో అంతస్తులోని మైక్ ప్రచార కేంద్రం, శృంగేరీ అన్నదాన భవనం, కేశ ఖండనశాల, మాడపాటి సత్రాలలో మిషన్లు ఏర్పాటు చేశారు. సిబ్బంది తమ తమ మొబైల్‌లో సైతం బయోమెట్రిక్ హాజరు వేసుకునేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. విధులకు హాజరైన సిబ్బంది ఆలయ ప్రాంగణంలో ఎక్కడి నుంచైనా బయోమెట్రిల్ హాజరు వేసుకునే వీలు ఉంది. మొబైల్‌లో బయోమెట్రిక్ వేయడంలో అనేక మందికి అవగాహన లోపానికి తోడు కొండపై సిగ్నల్ సమస్య మరో ప్రధాన కారణంగా ఆలయ సిబ్బంది పేర్కొంటున్నారు. బయోమెట్రిక్ మిషన్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. వేతనాల కోత పడటంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు గతంలో ఎన్నడూ లేని విధంగా 10వ తేదీ తర్వాతే వేతనాలు బ్యాంక్‌లో జమవుతున్నాయి. గతంలో ప్రతి నెలా రెండు, మూడు తేదీల్లో పడే వేతనాలు మూడు నెలలుగా ఆలస్యంగా జమవుతున్నాయి. మార్చి నెలలో ఇన్‌కం ట్యాక్స్ చెల్లింపులు వంటి అంశాల నేపథ్యంలో ఆలస్యమైనా మరీ 12వ తేదీన వేతనాలు జమ చేయడం సరికాదని ఉద్యోగులు బహిరంగంగానే పేర్కొంటున్నారు.

ఆందోళనలో చిన్న, మధ్య తరగతి కాంట్రాక్టర్లు

- బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం మొండిచేయి
- నేడు మంగళగిరిలో సమావేశం కానున్న కాంట్రాక్టర్లు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మార్చి నెల ముగుస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి బిల్లుల చెల్లింపులు చేసేందుకు ఎలాంటి స్పందన లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చిన్న, మధ్య తరగతి కాంట్రాక్టర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నట్లు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చైర్మన్ అత్తలూరి నాగమల్లేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో భవిష్యత్‌పై చర్చించేందుకు ఈ నెల 13న గురువారం మంగళగిరిలోని మధు కళామండపంలో సమావేశం కావాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టర్లు నిర్ణయించామన్నారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టర్లందరూ సంసిద్ధులై కదలి వస్తున్నారని తెలిపారు. జనవరిలో ముగ్గురు సహచరులను కోల్పోయామని, ఆ సంఖ్య మరింత పెరగకుండా చూడాల్సిన అవసరం, సభ్యుల భవిష్యత్తు విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత బీఏఐ, స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్లపై ఉందని నాగమల్లేశ్వరరావు పేర్కొన్నారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు బుధవారం విరాళాలను అందజేశారు. విజయవాడ పటమటకు చెందిన గొట్టిపాటి వెంకటరమణ అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసిన వెంకటరమణ తన పేరిట రూ. 1,00,116లు, గొట్టిపాటి అరుణకుమారి పేరిట రూ.1,00,116ల విరాళాలను ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు దాతకు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.